## క్లుప్తంగా

### ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: మండల నూతన ఎంపీడీఓగా బీ శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న అప్పాజీ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

### పోలేరమ్మకు విశేష పూజలు



ఆత్మకూరురూరల్: మహిమలూరులో గ్రామదేవత పోలేరమ్మకు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. పెదకాపు మెట్టుకూరు పద్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పోలేరమ్మకు చద్ది సమర్పించారు.

### ఆలయాల నిర్మాణానికి భూమి పూజ



సంగం: మండలంలోని పడమటిపాళెంలో మహాలక్ష్మమ్మ, విజయగణపతి ఆలయాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచ్ కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, పద్మజ దంపతులు శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ ఆలయ జీర్ణోద్ధరణ, విజయ గణపతి ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి నవంబరులో విగ్రహాలను ప్రతిష్టిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ,ప్రసాద్‌గౌడ్ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో లలితారుద్ర మహాయజ్ఞం



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో లలితారుద్ర మహాయజ్ఞాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా లోకకల్యాణార్థం, విశ్వశాంతి, ధర్మస్థాపనార్థం, సంవృద్ధిగా పాడిపంటలు పండాలని 45 రోజుల పాటు లలితా రుద్ర మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లుగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి తెలిపారు.

### భవన నిర్మాణ పనుల పరిశీలన



ఉదయగిరి రూరల్: మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనుల నాణ్యతను పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్ మణికుమార్ బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన సమయంలోగా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాసరాజు ఉన్నారు.

### యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి చెరువు నుంచి గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. బుధవారం టీడీపీ నాయకుల అండతో కొందరు చెరువులోని గ్రావెల్‌ను జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో పెద్ద ఎత్తున తరలించారు. రైతుల పేరుతో అనుమతులు తీసుకుని ప్రకాశం జిల్లా పామూరు సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఓ పెట్రోల్ బంకు నిర్మాణం కోసం తరలించారు. హైవేపై ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా అక్రమ రవాణా సాగిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పశువైద్యం..గగనం

**వరికుంటపాడు మండలంలో పశువైద్యం దైవాధీనంగా మారింది. వైద్యాధికారులే కాదు..సిబ్బంది పూర్తిస్థాయిలో లేక సేవలు గగనంగా మారాయి. పేరుకు రెండు ఆస్పత్రులు ఉన్నా ఇన్‌చార్జి వైద్యాధికారి చుట్టపు చూపుగా నెలకు రెండు, మూడు సార్లు వస్తుండడంతో పాడిరైతులు, జీవాల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**



వేంపాడు పంచాయతీలోని రైతుసేవా కేంద్రం

వరికుంటపాడు: మండలంలోని రైతులు ఎక్కువగా గేదెలు, జీవాల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మండలంలో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లిలో పశువైద్యశాలలు ఉన్నాయి. రెండు ఆస్పత్రుల్లోనూ మూడు నెలల నుంచి రెగ్యులర్ వైద్యులు లేరు. కలిగిరి మండలం సిద్ధనకొండూరు ప్రభుత్వ పశువైద్యశాల వైద్యుడు రాజుకోట శ్రీహరిన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన సొంత మండలంలో విధులు నిర్వహిస్తూ సుదూరంగా ఉన్న వరికుంటపాడుకు నెలకు రెండు లేదా మూడు సార్లు చుట్టపుచూపుగా వస్తున్నారు. రెండు ఆస్పత్రుల్లోనూ వెటర్నరీ అసిస్టెంట్లు ఉన్నా వారు పశువులను చూసేందుకు వెళితే ఆస్పత్రులను మూసేయాల్సి వస్తోంది. మరోవైపు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండాల్సిన ఏహెచ్‌ఏలు లేకపోవడంతో పశువులకు ఏదైనా జబ్బు చేస్తే రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పశువైద్య సిబ్బంది కొరతతో పశువులకు వ్యాక్సినేషన్, నట్టల నివారణ కార్యక్రమాలు సాగడం లేదు.

**వేంపాడు పంచాయతీలో ఇదీ పరిస్థితి..**

వేంపాడు రైతుభరోసా కేంద్రంలో ఏహెచ్‌ఏ అందుబాటులో లేదు. గత సంవత్సరం రోజులుగా ఏహెచ్‌ఏ విధుల్లో ఉన్నాడా, సెలవు పెట్టారా, విధుల నుంచి తొలగించారా అనేది తెలియని పరిస్థితి. రైతు భరోసా కేంద్రం తాళాలను తీసే నాథుడే కరువయ్యారు. వేంపాడు పంచాయతీలో మూడు వేల గొర్రెలు, 200 మేకలు, 500 గేదెలు ఉన్నాయి. పశువైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్లు లేకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, జీవాలకు ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మండలంలోని మిగిలిన గ్రామ పంచాయతీల్లోనూ ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది.

**ఏహెచ్‌ఏ ఎవరో తెలియదు**



వేంపాడు రైతుసేవా కేంద్రం పరిధిలో ఏహెచ్‌ఏ ఉన్నారో.. లేరో కూడా తెలియదు. పశువైద్యశాలలో కూడా డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. నాకు 200 గొర్రెలున్నాయి. వాటి సమస్య వస్తే ఎవరికి చెప్పాలో.. ఎవరితో వైద్యం చేయించాలో తెలియడం లేదు. వ్యాక్సిన్లు, నట్టల నివారణ మందులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు.

–నూతలపాటి సుధ, వెంగమాంబపురం

**తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం**



మండలంలో రెండు పశువుల ఆస్పత్రులు ఉన్నా మూడు నెలలుగా వైద్యులు లేరు. ఇన్‌చార్జి వైద్యులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియడం లేదు. నాకు 150 గొర్రెలు, ఐదు గేదెలు ఉన్నాయి. వాటికి ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

–నూతలపాటి లక్ష్మణ

## మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సత్యవాణి

చేజర్ల(సోమశిల): జిల్లాలో ప్రత్యామ్నాయ పంటగా సైలేజ్ మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. చేజర్ల మండలం వావిలేరు, పాడేరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతో సైలేజ్ మొక్కజొన్నను సాగుచేసి 75 రోజుల్లో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎకరా సాగుచేస్తే ఖర్చులు పోగా సుమారు రూ.20వేల వరకు ఆదాయం వస్తుందని వివరించారు. సాగుపై సందేహాలు ఉంటే విశ్రాంత సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసుని సంప్రదించాలని సూచించారు. ఏడీఏలు నర్సోజీ, శ్రీదేవి, ఏఓ హిమబిందు, వీఏఏలు నారాయణ, హజరత్, సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

## విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి అన్నారు. ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవలో పాలు పంచుకోవాలన్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా చేసేవారే జాతీయ సేవా పథకం నిజమైన వలంటీర్లు అన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్మోహన్

ఉదయగిరి రూరల్ : మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మోహన్ బీఎల్వోలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. మరణించిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సరిచేసరి పారదర్శకంగా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సీనియర్ సహాయకులు నీహా, సీఏ అలీం, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవలు అందక ఇక్కట్లు

సోమశిల: అనంతసాగరం మండలంలో ఆధార్ సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రేవూరు, అనంతసాగరం, సోమశిల తదితర గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందించే వారు. గత కొన్నిరోజులుగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో దసరా సెలవులకు ఊర్లకు వచ్చిన సుదూర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ ఆధార్ కార్డుల్లో తప్పిదాలను సరిచేసుకునేందుకు సంబంధిత సచివాలయాలకు వచ్చి నిరాశగా వెనుతిరిగి వెళ్తున్నారు. కొందరు ఆత్మకూరు, నెల్లూరుకు వెళ్లి ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకుంటున్నారు. దసరా సెలవుల సమయంలోనే ఆధార్ సేవలను నిలిపివేయడంపై అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఆధార్ సేవలను వెంటనే కొనసాగించాలని సర్వత్రా కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌ను సంప్రదించగా గతంలో ఆధార్ సేవలు అందిస్తున్న గ్రామసచివాలయాల్లోని సిబ్బంది బదిలీ కావడం, కంప్యూటర్ల మరమ్మతులకు గురవడం, తదితర కారణాలతో సేవలు నిలిచిపోయాయని తెలిపారు. బుధవారం నుంచి కొత్తపల్లి సచివాలయంలో ఆధార్ కేంద్రాని ప్రారంభించామని, గురువారం నుంచి పీకేపాడులో ప్రారంభిస్తామన్నారు.

## ఉదయగిరిని జిల్లా చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న పొదుపు మహిళలు

ఉదయగిరి: మెట్టప్రాంతమైన ఉదయగిరి కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొదుపు మహిళలు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్టప్రాంతమైన ఉదయగిరి అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఉదయగిరిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే ఉదయగిరి జిల్లా సాధన సమితి పోరాటం చేస్తోందని, వారికి తమ వంతు మద్దతుగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా తెలిపారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యమ నాయకులు దస్తగిరిఅహ్మద్, రంతుజానీ, తదితరులు పాల్గొన్నారు.


## అర్బన్ మార్కెట్ ప్రారంభం




స్టాళ్లను పరిశీలిస్తున్న కమిషనర్

కావలి(అల్లూరు): పట్టణంలోని రైల్వేరోడ్డులో అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యాపారులుగా మార్చడమే లక్ష్యంగా తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్‌డీసీ ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను విక్రయించడం మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. డీఈ సాయిరామ్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, ఏఈ షైనీ, టిడ్కో హౌసింగ్ అధికారి జనార్దన్, మెప్మా సీఎంఎం భారతి, సీఓలు బీ కొండయ్య, కే ప్రతాప్‌కుమార్, కే అరుణకుమారి, ప్రసన్న, ఐ.సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



సంగంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది



కలిగిరిలో పౌష్టికాహారం పంపిణీ

కలిగిరి: మహిళలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి సూచించారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా కలిగిరి పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళల్లో అధికంగా వస్తున్న కేన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదిరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసులురెడ్డి, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యసిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి మల్లెం కొండయ్య పాల్గొన్నారు.

## రామాలయంలో చోరీ

వరికుంటపాడు: మండలంలోని తూర్పుకొండారెడ్డిపల్లిలోని రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు అమ్మవారి బంగారు తాళిబొట్లు, హుండీలోని నగదును చోరీ చేశారు. హుండీలో సుమారు రూ.8వేల వరకు ఉండొచ్చని గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు.

## అల్లుకున్న నిర్లక్ష్యం



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడు నుంచి నల్లగొండ్ల వైపు వెళ్లే మార్గంలో వెన్నవాడ ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాలను పిచ్చితీగలు దట్టంగా అల్లుకుపోయాయి. వాటిని తొలగించకుండా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో చిన్నపాటి గాలివీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈ కారణంగా సుమారు ఏడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



కలిగిరి: లలితాత్రిపురసుందరీగా భద్రకాళి



ఉదయగిరిరూరల్: అన్నపూర్ణగా పార్వతిదేవి



దుత్తలూరు: భువనేశ్వరిగా రేణుకఎల్లమ్మ

## జగజ్జననీ నమోస్తుతే



సీతారామపురం: గాయిత్రీదేవిగా ఇష్టకామేశ్వరీదేవి



కాశీనాయన ఆశ్రమంలో అన్నపూర్ణాదేవిగా సరస్వతీదేవి



ఆత్మకూరురూరల్: మంగళగౌరీగా జ్వాలాముఖి

ఆత్మకూరురూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆలయాల్లో మూడోరోజు బుధవారం అమ్మవారు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చింది. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. ఆలయ ప్రధానార్చకుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. కాశీనాయన ఆశ్రమంలో అన్నపూర్ణాదేవిగా సరస్వతీదేవి భక్తులను అనుగ్రహించారు. ఉత్తర బలిజవీధిలోని జ్వాలాముఖి అమ్మవారు మంగళగౌరీదేవిగా దర్శనమిచారు.

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షిదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయంలో గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు అనుగ్రహించారు.

సీతారామపురం : మండలంలోని సిద్ధేశ్వరం క్షేత్రంలో ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమాత గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీ గుదేవారిపాళెంలో రేణుక ఎల్లమ్మతల్లి భువనేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. దుత్తలూరులోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలోని సంతానలక్ష్మి ఆలయం, పార్వతీ పరమేశ్వర ఆలయం, గండిపాళెంలోని నాగరప్పమ్మ ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

కలిగిరి: మండలంలోని తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు లలిత త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చింది.



సంగం: గాయత్రీదేవిగా గంగమ్మ



సంగం: అన్నపూర్ణాదేవిగా కామాక్షిదేవి



ఆత్మకూరురూరల్: విశ్వేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం

## మహమ్మద్ ప్రవక్త ఆదర్శమూర్తి



ఉదయగిరి: మహమ్మద్ ప్రవక్త ఆదర్శమూర్తి అని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యుడు కేఎం అబ్దుల్ సుభహాన్ పేర్కొన్నారు. పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో మహమ్మద్ ప్రవక్త జన్మించిన నెలను పురస్కరించుకుని ఆదర్శమూర్తి మహమ్మద్ పేరుతో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. జమాతే ఇస్లామీ హింద్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నందిగుంట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తక్కెళ్లపాడుకు చెందిన యోహాను వింజమూరు నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. నందిగుంట సమీపంలో ముందు వెళ్తున్న టిప్పర్ జాతీయ రహదారి కాంట్రాక్టర్‌కు చెందిన క్యాంపు కార్యాలయంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా కుడివైపునకు తిరగడంతో యోహాను అదుపుతప్పి వెనుకగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలవగా స్థానికులు 108 వాహనంలో వింజమూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కిలో పొగాకు గరిష్ట ధర రూ.345

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.345 ధర లభించింది. వేలానికి 1121 బేళ్లు రాగా, అందులో 815 బేళ్లను కొనుగోలు చేశారు. వేలం కిలో పొగాకు గరిష్టంగా రూ.345, కనిష్టంగా రూ.89, సగటున రూ.204.39 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 346 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 722 బేళ్లను తీసుకురాగా, 603 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.346, కనిష్టంగా రూ.84, సరాసరిన రూ.219.29 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.